# బలిజేపల్లివారి 'బ్రహ్మరథం'

## శ్రీ జాగు ఆంజనేయులు

వెంకట్రామా ఫిలిమ్సు వారి "బ్రహ్మరథం" గదా! బలిజేపల్లి వారి "బ్రహ్మరథం" అన్నారేమిటి? అనే సందేహం కలుగవచ్చు. నేను చేసేది కవిత్వ విమర్శ గనుక యీ చిత్రానికి కవితా సారథ్యం చేసినవారు బలిజేపల్లి వారుగాన "బలిజేపల్లి వారి బ్రహ్మరథం" అని వాడ వలసివచ్చింది.

"బ్రహ్మరథం" అని నామకరణం చేయడంలో కవిగారి ముఖ్యోద్దేశ మేమిటో అగమ్య గోచరంగా వుంది. మహా పతివ్రతయైన శచీదేవిని అనుభవించాలనే కాముకంలో వచ్చిన నహుషునిచే "త్రిలోకాలలో తనకు అడ్డు చెప్పేవారు లేరనీ, ఆ యా ప్రదేశాలలో వుండే యెంతటి దుర్లభవస్తువైనను అనుభవించుటకు హక్కు గలదని నిరూపిస్తూ వుదాహారణంగా సప్త మహర్షులచే నైనా బ్రహ్మరథం పట్టిస్తాననీ ప్రగల్భాలు పలికించడమూ దాని పర్యవసానంగా మరణించిన వానిని పరేత నిలయానికి గొంపోవడాని కుపకరించే అనంత శైనంమీద ఎక్కించడమూ జరిగింది. అదేనా స్వామీ బ్రహ్మరథం? అదే బ్రహ్మరథం అయ్యేపక్షాన మర్త్య లోకంలో అరపాన మంచ లాంటి బ్రహ్మరథాన్ని ప్రతీ మానవుడూ అధిరోహిస్తున్నాడే! ఆ మాత్రపు బ్రహ్మరథం ఎక్కలేనిదే నహుషుడు నాశానికి వెళ్ళాడో అందుచేత ఆచిత్రానికి "బ్రహ్మరథం" అనే నామకరణం చేయడంలో చాలాపొరపాటుజరిగింది.

అలాంటి బ్రహ్మరథాన్నధిరోహించి, శచీదేవిని యింద్రాణిగా చేసికో కుతూహల పడుచున్న నహుషునిచే "సర్ప, సర్ప" అనే మాటలు అప్రస్తుతంగాను, అసందర్భముగాను, అసౌలభ్యంగాను అనిపించడంలో వుద్దేశం? శవాలను రుద్రభూమికి గొంపోయే అనంత శైనం లాంటి బ్రహ్మరథాన్నెక్కిన నహుషునకు శచీదేవైనా సర్పంలా కనిపించిందా? లేక మునీశ్వరులచే సర్పంగా శపించబడడానికి కారణమేమీ కనుపించక పోగా నహుషునిచే అసందర్భపు మాటలు అనిపించవలసి వచ్చిందా స్వామీ? యీ విషయంలో కవితా కళానిధులే కవితామతల్లికి కళంకం ఆపాదించ చేశారంటే ఎంత శోచనీయం?

కౌరవ సభలో కురువీరులు ద్రౌపదీ మానభంగానికి బద్ధెట్టు ప్లాన్ చేయడం; అదే సమయానికి సైంధవుని రప్పించి, అతనిచే "ద్రౌపదీ మానభంగం వంటూ సాది" అని నిష్కర్షగా అనిపించారంటే—సింధుదేశానికి మహా వీరుడు, ఏకైక రాజును, రారాజైన సుయోధనుని బావమరది యైన యోధుడగు సైంధవుడు కేవలం స్త్రీల మానభంగాలకే తన వీరత్వాన్నుపయోగింప నవతరించిన యోధుడు, అని అనిపిస్తుంది.

యిదీ కాకుండా సైంధవుని బుర్రగొరిగి, సున్నపు బొట్లు పెట్టించి కూడా కోపం చల్లారక కుండచిప్పను నెత్తిపై బోర్లించారంటే అది కేవలం వీరలక్షణంగాదు. అది పాండవుల వీరత్వాన్ని చాటడానికి బదులుగా వారి అవినీతినీ, అవివేకత్వాన్నీ ప్రకటిస్తుంది. పైగా వారి 'ప్రజ్ఞను కౌరవుల వద్ద చాటించు' అని పాండవులచే అనిపించడంవల్ల వారి ప్రగల్భాన్నీ, వారంతటి బలాఢ్యులెవ్వరూ లేరనే గర్వం పాండవులకున్నట్లు చాటుతూ వుండేగాని వేరేమీ కాదు. పైగా గొప్పవారెన్నడూ, తాము గొప్ప వారమని ఏ ఒక్కరితోనూ చెప్పుకోరు సరిగదా! పైగా ప్రకటించుమని పంపుతారా? మరొక విషయమేమంటే!

కవిగారు సైంధవునిచే "పాండవ వీర చరిత్రమూ వినుడీ! పరమ పవిత్రము జనులారా!" అని పాడించడంలో ఏమైనా అర్థముందా? తానొక శత్రువుచే అపరిమితముగా అపమానింప బడినవాడు నలుగురిలో తల ఎత్తుకొని తిరగడానికే సిగ్గు జెంది వుంటాడే? అలాంటి వాడు స్వయముగా బావమరది వద్దకు పరాభవ చిహ్నములతో వెళ్ళి శత్రువుల ఘనత్వాన్ని స్తుతిస్తాడంటే అర్థముందా? యదార్థంగా అలా స్తుతిస్తాడనే కవిగారా పాటను పాడించారా?

పాటి రాజుపైగా బావమరది అయిన సైంధవుడు ఒకవేళ శత్రువైనా శరణుజొచ్చి రక్షించుమని ప్రార్థేయ పడినా ననకుండా తన తమ్ములకివిని అవమానిస్తూంటే—తన ఆత్మ గౌరవం కూడా అటువంటిదే అని గ్రహించిన ధర్మజుడు కూడా చూస్తూ సహించి వూరుకున్నాడంటే, యింక అతని ధర్మత్వం ఎక్కడుంది? అలాంటివాడు ధర్మరాజెలాగౌతాడు? యీ విషయాల్లో బలిజేపల్లి వారు హాస్యంకోసం సైంధవావమానాన్ని సృష్టించారనే కాకుండా "భారతాన్ని బొంకు" అని నిదర్శన రూపంగా చూపించారనడంలో ఏమాత్రం సందేహించ నవసరంలేదు.

యింక పాటలు చప్పగా వున్నాయి. సాహిత్యం సున్న. సునిశితమైన భావమన్నది చూద్దామంటే లేదు. మాటల్లో కూడా మాధుర్యం లేదు. ఎలాగైనా బ్రహ్మరథ కవితా సృష్టిలో బలిజేపల్లివారు బోల్తా కొట్టారనే చెప్పాలి.

రూపవాణి



RV Dec 47